

పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్

# బీఆర్ఎస్ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్
- జన్నారంలో పార్టీ కార్యాలయం ప్రారంభం

జన్నారం, అక్టోబర్ 30 : రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొంది, మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ఖానాపూర్ అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మండలాధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలనే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని దీమా వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో పని చేయాలని సూచించారు. ప్రతీ గ్రామంలో బూత్ లెవల్ కమిటీ ఏర్పాటు చేసి, ఎక్కడి వారు అక్కడే ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించాలని సూచించారు. రాబోయె 28రోజుల పాటు ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీపీ మాదాడి సరోజన, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సీపతి బుచ్చన్న, కో అప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, రియాజుద్దీన్, సత్యం, తోకల సురేశ్, నసీమ, జక్కుల సురేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి, చిత్రంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు

# దొంగలొస్తున్నారు.. జాగ్రత్త

- ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి

కెరమెరి, అక్టోబర్ 30 : ఎన్నికలు వస్తేనే ఓట్లు దండుకోవడానికి వచ్చే దొంగలు, దళారులపై పార్టీ కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి సూచించారు. కెరిమెరి మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోవ లక్ష్మి మాట్లాడుతూ.. ఇటీవలే సీఎం కేసీఆర్ఆర్ ప్రవేశపెట్టిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని సంక్షేమ పథకాలకు తెలంగాణ ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు అంటూ పార్టీ నాయకుల టికెట్‌కే గ్యారంటీ లేని పరిస్థితి నెలకొందన్నారు. ఆది నుంచి పని చేసిన నాయకులను మిస్మరించి, దొంగలు, దోచుకున్న వారికి డబ్బులు తీసుకొని టికెట్ ఇచ్చారని విమర్శించారు. పూటకో మాట, పార్టీ మారుతున్న వారికి పెద్ద పీట వేస్తున్న కాంగ్రెస్ నాయకులకే గ్యారంటీ లేదని ఆరోపించారు. కర్ణాటకలో ఇలాగే అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ, ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. నీళ్లు, నిధులు, నియమకాలు అనే నినాదంతో సీఎం కేసీఆర్ పోరాడి తెలంగాణను సాధించిన యోధుడని కొనియాడారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర నాయకుడి నుంచి గ్రామ కార్యకర్త బాధ్యత తీసుకొని బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటా వివరించాలని సూచచించారు. ప్రతి పక్షాలను నమ్మే పరిస్థితుల్లో తెలంగాణ ప్రజలు లేరని పేర్కొన్నారు. అబద్దాలు చెప్తూ గాలిలో మేడలు కట్టే వారి మాటలు నమ్మి మోసపోవద్దని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. మళ్లీ వచ్చేది బీఅర్ఎస్ ప్రభుత్వమేనని, ప్రజలు అప్రమత్తంగా ఉండేలా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. అన్ని కులాలు, మతాలకు అనుగుణంగా పని చేసేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, మళ్లీ సీఎంగా కేసీఆర్ ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి, భారీ మెజారిటీతో కోవ లక్ష్మిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతీరాం, జడ్పీటీసీ సెడ్మాకి దుర్పతాబాయి, వైస్ ఎంపీపీ అబూల్ కలాం, సింగిల్ విండో చైర్మన్ శంకర్, రైతు బంధు మండలాధ్యక్షుడు కేంద్రె బాలాజీ, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు కుమ్రం నాణేశ్వర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు షేక్ యూనుస్, మడావి రఘునాథ్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ ఖుత్బొద్దీన్, పార్టీ మండలాధ్యక్షుడు రాథోడ్ ఉత్తం నాయక్, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, క్రియాశీల నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- బీఆర్ఎస్ మంచిర్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే దివాకర్‌రావు
- పట్టణంలోని 20వ వార్డు, నర్సింగాపూర్‌లో ప్రచారం



హాజీపూర్ : ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్ రావు

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 30 : గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి తనకు అవకాశం ఇవ్వాలని మంచిర్యాల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రజలను కోరారు. మంచిర్యాల పట్టణంలోని 20వ వార్డు రాంనగర్‌లో సోమవారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తెలంగాణ సర్కారు చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే మ్యానిఫెస్టోలో ప్రకటించిన అంశాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో లేవన్నారు. పైగా అమలుకు నోచుకోని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కర్ణాటకలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కరెంటు కోతలతో సతమతమవుతున్నారని తెలిపారు. దీంతో ఇక్కడ చేతిగుర్తుకు ఓటు వేస్తే మిగిలేది ఏమీ ఉండదని, ఇక పువ్వు గుర్తుకు ఓటువేస్తే అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తారని, ప్రజలకంటే వారి స్వప్రయోజనాల కోసమే పనిచేస్తారని విమర్శించారు. నియోజకవర్గంలో అభివృద్ధి జరగడంలేదని అనే వారు ఒక్కసారి కండ్లు తెరిచి చూడాలని హితవు పలికారు. పాత మంచిర్యాల నుంచి ఇందారం క్రాస్ వరకు నాలుగు వరుసల రహదారి, ఐబీ చౌరస్తా నుంచి శ్రీనివాస గార్డెన్ వరకు చేపట్టబోయే ఆరు వరుసల రహదారి, హమాలీవాడ దగ్గర రెండు వరుసల అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి, ప్రధాన రహదారిపై నాలుగు ప్రాంతాల్లో నిర్మాణ దశలో ఉన్న చూడముచ్చటైన సర్కిళ్లు, పట్టణంలో అంతర్గత రహదారుల నిర్మాణం, విస్తరణ పనులు, పూర్తయిన పార్కులు, ఓపెన్‌జిమ్ కనబడటంలేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గాదె సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ సుదమల్ల హరికృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు అంకం నరేశ్, సురేశ్ బల్దవా, మాదంశెట్టి సత్యనారాయణ, ప్రకాశ్‌నాయక్, నాయకులు పల్లపు తిరుపతి, గడప రాకేశ్, గరిగంటి సరోజ, ఎర్రం తిరుపతి, బొలిశెట్టి రాజన్న, బొలిశెట్టి కిషన్, ప్రవీణ్, సుధీర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగాపూర్‌లో..

హాజీపూర్, అక్టోబర్ 30 : మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో దివాకర్ రావు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, గ్రామాల్లో చేస్తున్న అభివృద్ధి పనులను వివరించారు. రానున్న ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి జరగాలంటే కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యే వెంట హాజీపూర్ ఎంపీపీ మందపెల్లి స్వర్ణలత, జడ్పీ కో-ఆప్షన్ నయీం పాషా, పార్టీ మండలాధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్, రాపెల్లి సర్పంచ్ అనె మల్లేశ్, నాయకులు మట్టపెల్లి సత్యనారాయణ రావు, మాజీ సర్పంచ్ సీపెల్లి మొగిళి, మాజీ ఉప సర్పంచ్ అబ్దుల్లాతో పాటు కార్యకర్తలు, నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# మరింత అభివృద్ధి చేస్తా

- సిర్పూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప
- బెజ్జూర్‌లో పలువురి చేరిక

బెజ్జూర్, అక్టోబర్ 30 : కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతున్నదని, మళ్లీ అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తామని సిర్పూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రజలను కోరారు. బెజ్జూర్ మండల కేంద్రంలో కోనప్ప సమక్షంలో సోమవారం తాజుద్దీన్, అమీరుద్దీన్ అన్నదమ్ముల ఆధ్వర్యంలో పలువురు ముస్లిం యువకులు, మారుమూల ప్రాంతాల తమ అనుచరులు బీఆర్ఎస్‌లో చేరారు. కాగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే మండలంలోని పాపన్‌పేట, రెబ్బెన, అంబాగట్, మొగవెల్లి, ఇప్పలగూడ, ఎల్కపల్లి తదితర గ్రామాలకు చెందిన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం కోనప్ప మాట్లాడారు. బెజ్జూర్ మండల ప్రజలు పదేళ్ల క్రితం రోడ్లులేక, వాగులపై వంతెనలు లేక



మాట్లాడుతున్న సిర్పూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే కోనప్ప

రాకపోకలకు నరకయాతన అనుభవించారన్నారు. సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించామని గుర్తుచేశారు. గూడెం వద్ద ప్రాణహితపై వంతెన నిర్మించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. తలాయి, కుశ్నపల్లి, కుకుడ తదితర వాగులపై వంతెనల నిర్మాణాలతో రవాణా వ్యవస్థ బాగుపడిందని గుర్తుచేశారు. సోమిని, మొగవెల్లి గ్రామాలకు రోడ్లు, వంతెనలు పూర్తి చేసే అవకాశం మరోసారి ఇవావలని ప్రజలను కోరారు. గొల్లబాయి చెరువు ఆయకట్టు పొలాలు చూస్తుంటే ఎనలేని సంతోషం కలుగుతున్నదన్నారు. పచ్చని పొలాలతో బీడు భూములన్నీ పంట పొలాలుగా మార్చడం కోసం తాను ఎంతగానో కృషిచేశామని చెప్పారు. పోడు పట్టాలకు బీజం వేసింది తన సోదరుడు కృష్ణారావేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు సిడాం సాకారం, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు కోండ్ర జగ్గాగౌడ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ డోకె వెంకన్న, కో-ఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, నాయకులు సతీశ్, నాహెర్, జావీద్ అలీఖాన్, జాహిద్, తంగెడిపల్లి మహేశ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# బీజేపీ అభ్యర్థి టికెట్ రద్దు చేయాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

బెల్లంపల్లి, అక్టోబర్ 30 : బెల్లంపల్లి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అమరాజుల శ్రీదేవికి కేటాయించిన టికెట్‌ను రద్దు చేయాలని ఆ పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కొయ్యల ఏమాజీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం బెల్లంపల్లి-నెన్నెల ప్రధాన రహదారిపై లంబాడీ తండా వద్ద రాస్తారోకో నిర్వహించారు. అనామకురాలైన శ్రీదేవికి ఇచ్చిన టికెట్‌ను రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బొల్లెడ కేశవరెడ్డి, సీనియర్ నాయకులు అజ్మీరా శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డి, దూది ప్రకాశ్ మాట్లాడుతూ.. ఎనిమిదేళ్లుగా పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్న ఏమాజీకి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకుండా.. ఇటీవల పార్టీలో చేరిన శ్రీదేవికి టికెట్ ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. నియోజకవర్గంలో బలహీనంగా ఉన్న పార్టీని ఏమాజీ గ్రామస్థాయిలో బలోపేతం చేశారని గుర్తుచేశారు. శ్రీదేవికి ఏ ప్రాతిపదికన టికెట్ కేటాయించారో అధిష్టానం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకత్వం చర్యలతో పార్టీకి నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర నాయకులు సర్వేల ద్వారా టికెట్లు కేటాయిస్తామని చెప్పి వాటిని తుంగలో తొక్కారని ఆరోపించారు. మాజీ ఎంపీ గడ్డం వివేక్.. తన అన్న గడ్డం వినోద్ గెలుపు కోసం డమ్మీ అభ్యర్థికి టికెట్ ఇప్పించారని విమర్శించారు. బీజేపీ గెలవడానికి అవకాశమున్న సీటును కాంగ్రెస్ పార్టీకి తాకట్టు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ టికెట్ కొయ్యల ఏమాజీకి కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, శ్రావణ్‌కుమార్, నర్సింగ్, సత్యనారాయణ, బియ్యాల గట్టయ్య, సుభాష్ అజ్మీరా, కోలా ప్రవీణ్‌కుమార్, కలాలికృష్ణ, బ్రహ్మానందం, ప్రభాకర్, కోట రాజు, వంశీ, రామయ్య పాల్గొన్నారు.